సాక్షి సంగారెడ్డి

శనివారం। 16। నవంబర్। 2024







కేతకీ ఆలయంలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు



## కేతకీ ఆలయానికి కార్తీక శోభ



కార్తీక పౌర్ణమి సందర్భంగా సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని కేతకీ సంగమేశ్వరాలయం కార్తీక శోభను సంతరించుకుంది. భక్తులు ఉదయం నుంచి స్వామి వారిని దర్శించుకుని భక్తి ప్రపత్తులతో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆకాశ దీపాన్ని వెలిగించి స్వామివారి పల్లకీ సేవను నిర్వహించారు. అనంతరం కమలాకర్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తి గీతాలాపన భక్తులను అలరించింది. కార్యక్రమంలో ఆలయ అర్చకులు నాగరాజ్ శర్మ, శివకుమార్, ఇతర నిత్య సేవకులు, భక్తులు పాల్గొన్నారు. – ఝరాసంగం (జహీరాబాద్)

## న్యూస్‌రీల్

### రామలింగేశ్వర ఆలయంలో మంత్రి సురేఖ పూజలు



శివలింగానికి అభిషేకం చేస్తున్న మంత్రి సురేఖ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని నందికంది రామలింగేశ్వర ఆలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని మంత్రి కొండా సురేఖ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివలింగానికి అభిషేకం నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు ఆమెకు ఆలయ కమిటీ,అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. ఆలయ కమిటీ సభ్యులు ఆమెను ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు విజయ భాస్కర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### మల్లికార్జునస్వామి ఆలయాన్ని సందర్శించిన జిల్లా జడ్జి



కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన న్యాయమూర్తి భవానీ చంద్ర

సంగారెడ్డి టౌన్ : కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లాలోని సంగారెడ్డి మండలం తాళ్లపల్లి గ్రామంలో మల్లికార్జునస్వామి దేవాలయాన్ని శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీ చంద్ర కుటుంబసమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా సంగారెడ్డి పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో భక్తులు దీపారాధన, అభిషేకాలు చేశారు. ముఖ్యంగా మహిళలు తులసి మొక్కకు పూజలు చేసి శివాలయాల్లో కార్తీకదీపాలను వెలిగించారు.

### గణేష్ గడ్డ దేవస్థానంలో లక్ష దీపోత్సవం



గణేష్ గడ్డ దేవస్థానం ప్రాంగణంలో వెలిగించిన దీపాలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం గణేష్ గడ్డ దేవస్థానంలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని లక్ష దీపోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి, స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ పరిసరాలు సందడిగా కనిపించాయి. కార్యక్రమంలో ఆలయ అర్చకుల బృందం, జూనియర్ అసిస్టెంట్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు మాలల ఆత్మీయ సమ్మేళనం

జహీరాబాద్ టౌన్: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో శనివారం మాలల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షులు ఆకాష్ దీపక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంగారెడ్డిలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో ఉదయం 10 గంటలకు సమ్మేళనం ప్రారంభమవుతుందని చెప్పారు. జిల్లాలోని మాల ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, యువకులు, సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### నేడు డయల్ యువర్ డీఎం

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి ఆర్టీసీ డిపో పరిధిలో శనివారం రోజు డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఉంటుందని డిపో మేనేజర్ ఉపేందర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని జిల్లా పరిధిలోని ప్రయాణికులు వారి సమస్యలను, సలహా సూచనలను 99592 26267 నంబర్‌కు సంప్రదించాలన్నారు. ప్రయాణికులు ఈ అవకాశానికి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# గ్రూప్–3 పరీక్షకు సర్వం సిద్ధం

**జిల్లాలో 49 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు**

- పరీక్ష రాయనున్న 15,163 అభ్యర్థులు
- అభ్యర్థుల కోసం ప్రత్యేక బస్సులు
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్
- అరగంట ముందే కేంద్రాల గేట్లు మూసివేత

సంగారెడ్డి జోన్: జిల్లాలో గ్రూప్–3 పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 17, 18 తేదీలలో రెండు రోజుల పాటు జరగనున్న గ్రూప్–3 పరీక్ష ప్రశాంతంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 15,123 అభ్యర్థులు హాజరు కానుండగా జిల్లాలో 49 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షకు అభ్యర్థులు ఒరిజినల్ గుర్తింపుకార్డులను పరీక్ష కేంద్రానికి తీసుకురావాల్సి ఉంటుంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి శుక్రవారం మీడియాకు తెలిపారు.

**రెండు రోజులపాటు గ్రూప్3 పరీక్ష**

ఈనెల 17 న ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పేపర్–1 (జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్) పరీక్ష, మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్– 2 హిస్టరీ, పోలిటి అండ్ సొసైటీ పరీక్ష నిర్వహణ జరగనుంది. పరీక్ష సమయానికి అరగంట ముందు పరీక్ష కేంద్రం గేట్లు ఉదయం 9.30 గంటలకు, మధ్యాహ్నం 2.30 గంటలకు మూసివేస్తారు. 18న ఉదయం 10.00 గంటలనుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్–3 ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ పరీక్ష జరగనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. పరీక్ష సమయానికి రెండు గంటల ముందే పరీక్ష కేంద్రానికి చేరుకునేలా అభ్యర్థులు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

**పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్**

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని కలెక్టర్ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఏఎన్ఎం, మందులను అందుబాటులో ఉంచనున్నట్లు వివరించారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకునేలా ఆయా రూట్లలో ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణ కోసం జిల్లాలోని 49 పరీక్షా కేంద్రాలను 9 రూట్లుగా విభజించినట్లు ఒక్కో రూటుకు ఒక్కో జాయింట్ రూట్ ఆఫీసర్ లు నియమించినట్లు వెల్లడించారు.



ప్రతీ పరీక్ష కేంద్రానికి ఒక డిపార్ట్‌మెంట్ అధికారి, 119 మంది బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, 157 మంది గుర్తింపు అధికారులు, 15 ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, ఇతరసిబ్బంది 34 మందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**అభ్యర్థులకు సూచనలు, సలహాలు**

- అభ్యర్థులు నలుపు /నీలం బాల్ పాయింట్ పెన్నులు, పెన్సిల్, ఎరేజర్, హాల్ టికెట్‌ను దానిపై అతికించిన ఫొటో, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా చెల్లుబాటు అయ్యే ఫొటో ఉన్న గుర్తింపు కార్డును మాత్రమే పరీక్ష హాల్‌లోకి తీసుకెళ్లాలి.
- సమాధానాలు బాల్ పాయింట్ పెన్ (నీలం/నలుపు)తో మాత్రమే రాయాలన్నారు. మొబైల్, చేతి గడియారాలు, క్యాలిక్యులేటర్ తోపాటు ఎలాంటి ఎల్రక్టానిక్ వస్తువులకు పరీక్ష కేంద్రంలోకి అనుమతి లేదు.

# మట్టిలో మాణిక్యం మౌనిక

**రెండు ఉద్యోగాలు సాధించిన పేదింటి బిడ్డ**



మౌనిక

వట్‌పల్లి(అందోల్): ప్రతిభకు పేదరికం అడ్డురాదని నిరూపించింది ఈ ఫొటోలో కన్పిస్తున్న యువతి మౌనిక. ఇటీవల జరి గిన ఎక్సైజ్ కానిస్టేబుల్ ఉద్యోగాల్లో కానిస్టేబుల్ ఉద్యోగాన్ని సాధించిన మౌనిక గురువారం విడుదల చేసి గ్రూప్–4 పరీక్ష ఫలితాల్లో కూడా సర్కారీ కొలువుకు ఎంపికైంది. అందోల్ మండలం నాదులా పూర్ గ్రామానికి చెందిన మిర పకాయల హేమలత, శివ్వప్పలకు చెందిన మౌనిక చిన్నప్పట్నుంచీ చదువులో ముందుండేది. పేదరికం కారణంగా మౌనిక విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే పూర్తి చేసింది. ఉన్న కొద్దిపాటి భూమిలోనే తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుంటూ మౌనికను చదివించారు. ఉస్మానియా వర్సిటీలో ఉన్నత విద్య ను పూర్తి చేసిన మౌనిక పోటీ పరీక్షలు రాస్తూ రెండు ఉద్యోగాలు సాధించింది. సాధించిన విజయాలపట్ల తల్లిదండ్రులు, గ్రామస్తులు మౌనికను అభినందనలతో ముంచెత్తుతున్నారు. ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మౌనిక త్వరలోనే విద్యాశాఖలో కొలువులో చేరనున్నట్లు మౌనిక కుటుంబసభ్యులు 'సాక్షి'కి తెలిపారు.

# మొక్కవోని దీక్షకు దక్కిన ఫలితం

- గ్రూప్4లో ఇద్దరికి ప్రభుత్వ కొలువులు



రాజ్‌కుమార్

నారాయణఖేడ్: ఖేడ్ జంట గ్రామమైన మంగళ్‌పేటకు చెందిన రాజ్ కుమార్, నాలుగు, ఐదు సంవత్సరాలుగా ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించాలని పట్టుదలతో పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. గ్రూప్4 రాస్తే ఇటీవల విడుదలైన ఫలితాల్లో ప్రభుత్వం కొలువు సాధించాడు. వాణిజ్య పనుల విభాగంలో జూనియర్ అసిస్టెంట్ గా పోస్టింగ్ ఇచ్చారు. మొట్టమొదటి ప్రభుత్వ ఉద్యోగం దక్కించుకోవడం తనకు ఆనందంగా ఉందని రాజ్ కుమార్ ఈ సందర్భంగా తెలిపారు. కర్ణాటక సెంట్రల్ వర్సిటీలో ఇంటిగ్రేటెడ్ బీఎస్సీ పూర్తి చేశారు. నారాయణఖేడ్ మండలం పిప్రికి చెందిన ధనరాజ్ డిగ్రీలో బీఎస్సీ కోర్సు పూర్తి చేశాడు. ప్రభుత్వ ఉద్యోగం సాధించడం కోసం ఐదు సంవత్సరాలుగా ప్రిపరేషన్ చేస్తున్నాడు. గ్రూప్ 4 పరీక్షలు రాసి విడుదలైన ఫలితాల్లో ఉద్యోగం దక్కించుకున్నాడు. ధనరాజుకు మున్సిపల్ వార్డు అధికారిగా ఉద్యోగం ఇచ్చారు. తాను కష్టపడి చదివినందుకు ఫలితం దక్కిందని ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.



ధనరాజ్

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

**48 గంటల్లో రైతులకు డబ్బులు జమ చేయాలి: కలెక్టర్**



చౌటకూర్‌లో వరి ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి: ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శుక్రవారం చౌటుకూరు మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, రైతులకు 48 గంటల్లో డబ్బులు రైతుల ఖాతాలో జమ చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన రిజిస్టర్లను ఆమె తనిఖీ చేశారు. ఇప్పటి వరకు వచ్చిన ధాన్యం వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దనే అమ్ముకొని, మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులు ధాన్యం తీసుకొచ్చిన వెంటనే తూకం జరిపించాలని, ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టికి తెచ్చి సమస్యను పరిష్కరించుకోవాలని కోరారు. ధాన్యం బస్తాల లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి, సంబంధిత మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కాగా, అనంతరం చౌటుకూరు మండల కేంద్రంలో జరుగుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాల సేకరణ కోసం నిర్వహిస్తున్న సమగ్ర సర్వే తీరును జిల్లా కలెక్టర్ పరిశీలించారు.


**గిరిజనులకు మెరుగైన మౌలిక వసతులు**

సంగారెడ్డి జోన్: గిరిజనుల సంక్షేమ అభివృద్ధి కోసం మెరుగైన వసతులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ధర్తిఆబా జన జాతీయ గగ్రామ్ ఉత్కర్ష అభియాన్ పథకం ప్రవేశపెట్టిందని కలెక్టర్ క్రాంతి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ధర్తీ ఆబ భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి పురస్కరించుకొని గిరిజన గౌరవ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి, చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో జీవనోపాధి, తాగునీరు, వైద్య సౌకర్యంతో పాటు నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా గిరిజన సంక్షేమాధికారి అఖిలేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీ పాఠశాలలో బోధనేతర సిబ్బంది

**టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్**

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ప్రతీ పాఠశాలలో బోధనేతర సిబ్బందిని నియమించడంతోపాటు మౌలిక వసతులు కల్పించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్‌కుమార్ రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులందరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న సామాజిక ఆర్థిక కులగణన కుటుంబ సర్వే కార్యక్రమంలో ఎన్యుమరేటర్లుగా విధులు నిర్వహిస్తున్న ఎస్‌జీటీ ఉపాధ్యాయుల సమస్యలను పరిశీలించి ఉపాధ్యాయ సంఘాలు చేస్తున్న సూచనలను పరిగణించాలన్నారు. కొఠారి కమిషన్ ప్రకారం విద్యకు రాష్ట్ర బడ్జెట్‌లో 30% కేటాయించాలని సూచినప్పటికీ ప్రభుత్వాలు 7% మాత్రమే నిధులు కేటాయించడం సరికాదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యాభివృద్ధి జరగాలంటే ప్రభుత్వం కనీసం15% కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రవీందర్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగారం శ్రీనివాస్, అనుముల రాంచందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అశోక్‌కుమార్

# రాముడొచ్చాడు..





బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారకరామారావుకు శుక్రవారం కందిలో ఘన స్వాగతం పలికారు. కందిలోని జిల్లా జైలులో ఉన్న వికారాబాద్ జిల్లా లగచర్ల రైతులను పరామర్శించేందుకు వచ్చారు. కేటీఆర్ వస్తున్నారనే సమాచారంతో నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలివచ్చారు. జాతీయ రహదారిపై గల ఓ దాబా వద్ద కేటీఆర్ కోసం పెద్ద ఎత్తున నిరీక్షించారు. ఇంతలోనే ఆయన రాగానే జై కేటీఆర్ అంటూ నినాదాలు చేయగా, వారికి అభివాదం చేశారు. కాగా, బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులను కట్టడి చేయడం పోలీసులకు ఇబ్బందిగా మారింది. అప్పటికే బారికేడ్ల ఏర్పాటు చేయడంతో కాన్వాయ్‌తో కేటీఆర్ జైలు లోపలకు వెళ్లారు. కేటీఆర్ వెంట వచ్చిన నాయకులు, కార్యకర్తలు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. – కంది(సంగారెడ్డి)

# ఒక్కసారి నాటు.. 30 ఏళ్లు పంట 'పట్టు'

**ఏడాదికి ఎనిమిది పంటలు**

- జిల్లాలో పెరుగుతున్న మల్బరీ సాగు
- తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు

సంగారెడ్డి జోన్: పట్టు చీర కడితేనే ఓ పుత్తడి బొమ్మ... ఆ కట్టుబడికే తరించేను పట్టు పురుగు జన్మ అంటూ పట్టుచీరపైనా, కట్టుకున్న మగువపైనా, ఆ చీరనందించిన పట్టుపురుగుపైనా అద్భుతమైన పాటను రాశాడో సినీ కవి. అంతెందుకు పట్టుచీరలంటే మగువలకెంత మక్కువో తెలియనిదెవరికీ? అలాంటి పట్టు చీరలనందించే పట్టు పురుగుల పెంపకం (మల్బరీ సాగు) ఇప్పుడు మంచి కాసులు కురిపిస్తోంది. అంతేనా! ఒక్కసారి నాటితే ఏకంగా 30 ఏళ్ల పాటు పంట వస్తుందని సాగు చేస్తోన్న రైతులు చెబుతున్నారు. మూడో సంవత్సరం నుంచి ఏడాదికి ఎనిమిది పంటలు వరకు తీయవచ్చని అంటున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని ఆర్జించే మల్బరీ సాగు పట్ల అందుకే రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు.

**ప్రస్తుతం 170 ఎకరాల్లో..**

జిల్లాలో 2014లో ప్రారంభమైన పట్టు పరిశ్రమ సాగు నేడు జిల్లా వ్యాప్తంగా 170 ఎకరాల విస్తీర్ణంలో మల్బరీ సాగవుతోంది. మరో 20 ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెంపొందించేందుకు అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. సాగు పెంపొందించేందుకు రైతులకు పంట విధానంతోపాటు మార్కెటింగ్, కేంద్ర ప్రభుత్వ అందించే రాయితీల పైనా అధికారులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. నీటి సౌకర్యం కలిగి ఉన్న నల్లరేగడి, చౌడు మినహా అన్ని భూములు మల్బరీ సాగుకు అనుకూలమని అధికారులు చెబుతున్నారు.

**ఏడాదికి 7 నుంచి 8 పంటలు**

బహు వార్షిక పంటైన మల్బరీ మొక్క ఒకసారి నాటితే 30 ఏళ్ల వరకు పంట ఉంటుంది. సాగు కొరకు నీటి సౌకర్యం తక్కువగా ఉంటుందని, సంవత్సర కాలంలో 7 నుండి 8 పంటలతో దిగుబడులు అధికంగా వస్తాయి. పంట సాగు నిర్వహణ సక్రమంగా ఉంటే తక్కువ ఖర్చు అధిక లాభాలు వచ్చే అవకాశాలూ ఉంటాయి. మొదటి సంవత్సరం 2 నుండి 3 పంటలు రాగా రెండో సంవత్సరంనుంచి 7 లేదా 8 పంటలు వస్తాయి.

**కేజీ రూ.600 పలుకుతున్న పట్టు**

పట్టుపురుగుల గూళ్ల తయారీ అనంతరం వాటి నాణ్యత ఆధారంగా ధర ఉంటుంది. కరోనా సమయంలో కేజీ పట్టు ధర రూ.200 నుంచి రూ.250 ఉండగా ప్రస్తుతం కేజీ ధర రూ.600వరకు పలుకుతోంది. దీంతోపాటు రైతుకు అదనంగా కేజీకి రూ.75 రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకంగా అందిస్తోంది. ఇక రైతులు సాగుచేసిన పట్టుగూళ్ల అమ్ముకునేందుకు హైదరాబాద్‌లోని తిరుమలగిరి, వరంగల్ జిల్లాలోని జనగామలో మార్కెటింగ్ సౌకర్యం కల్పించింది.

**సాగుకు కనీసం రెండెకరాలు...**

కనీసం రెండు ఎకరాల విస్తీర్ణంలో మల్బరీ సాగు చేయాలి. తోట పరిసర ప్రాంతంలో 20, 50 సీడ్స్ షెడ్డును ఏర్పాటు చేయాలి. షెడ్డు నిర్మాణం , పరికరాలకు సిల్క్ సమగ్ర పథకం–2లో భాగంగా కేంద్రం రాయితీని అందజేస్తోంది. రెండు ఎకరాల్లో పట్టుపురుగుల పెంచేందుకు మల్బరీ మొక్కలు నాటి 250 గుడ్లు తెచ్చుకోవాల్సి ఉంటుంది. గుడ్ల నుంచి బయటికి వచ్చిన పురుగులకు ఆకు కోసి వేయాల్సి ఉంటుంది. ఏర్పాటు చేసుకున్న షెడ్డులో చల్లటి వాతావరణం ఉండేలా చూసుకోవాలి. 20 నుంచి 25 రోజుల్లో పురుగులు గూళ్లను అల్లుకుంటాయి. చంద్రికల నుంచి పట్టుగూళ్లను వేరు చేసి మార్కెట్‌కు తరలించుకోవచ్చు. ఇలా మల్బరీ సాగులో సరైన యాజమాన్య పద్ధతులు అమలు చేస్తే స్థిరమైన అధిక ఆదాయాన్ని రైతులు సొంతం చేసుకోవచ్చు.



పెంపకంలో ఉన్న పట్టుపురుగులు

## క్లుప్తంగా

### ఇంతియాజ్‌కు సేవారత్న అవార్డు



ఇంతియాజ్‌ను అవార్డు అందజేస్తున్న చైర్మన్ రమేశ్, తదితరులు

**చిలప్‌చెడ్(నర్సాపూర్):** చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ గ్రామానికి చెందిన మీర్జా ఇంతియాజ్‌కు శుక్రవారం భారతీయ స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఎన్జీవో హానర్ సంస్థ ఆధ్వర్యంలో సేవారత్న నేషనల్ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ డాక్టర్ ఆకుల రమేశ్ హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో గల కళాభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇంతియాజ్‌ను సన్మానించారు. అనంతరం ఇంతియాజ్ మాట్లాడుతూ.. తాను చేసిన సేవలను గుర్తించిన స్ఫూర్తి సొసైటీ సర్వీస్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

### కథల పోటీల్లో పురస్కారం



బహుమతి అందుకుంటున్న అర్పిత

**హవేళిఘణాపూర్(మెదక్):** బాలల దినోత్సవం సందర్భంగా తెలంగాణ సారస్వత పరిషత్ హైదరాబాద్ కోదూరు శాంతమ్మ స్మారక కథల పోటీల్లో మండల కేంద్రమైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని అర్పిత తెలుగు కథల పోటీల్లో రాష్ట్రస్థాయి ఉత్తమ కథగా నగదు బహుమతిని, పురస్కారాన్ని అందుకున్నారు. ఆదివారం తెలంగాణ సారస్వత పరిషత్ హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులు కేవీ రమణ, ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, వరప్రసాదరెడ్డి, గరిపల్లి అశోక్, జుర్రు చెన్నయ్య చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. ఈ విషయంపై ప్రధానోపాధ్యాయులు కరుణాకర్ హర్షం వ్యక్తం చేశారు.

### బేస్ బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, పీడీ సతీష్

**సిద్దిపేటరూరల్:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే 68వ రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలకు జెడ్పీహెచ్ఎస్ నారాయణరావుపేట విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వడ్డేపల్లి నాగరాజు, పీడీ తోట సతీష్ శుక్రవారం తెలిపారు. అండర్ 17 విభాగంలో అభిరామ్ , నవనీత్, అండర్ 14 విభాగంలో దినేష్ రెడ్డి, వినయ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు 16 ,17, 18 తేదీల్లో నిర్మల్‌లో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, మండల విద్యాధికారి మామిండ్ల గౌరీ మోహన్, ఎస్జీఎఫ్ సెక్రటరీ సౌందర్య, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

### కుక్కల దాడిలో 16 మేకలు మృత్యువాత



**కంగ్టి(నారాయణఖేడ్):** వీధి కుక్కల దాడిలో మేకలు మృతి చెందిన ఘటన కంగ్టి మండలం దేగుల్‌వాడిలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ఉప్పరి గణపతి, రాంచందర్ రోజులాగే మేకలను ఇంటి వద్ద ఏర్పాటు చేసిన కొట్టంలోకి పంపించారు. వీధి కుక్కల గుంపు ఒక్కసారిగా మేకలపై దాడి చేయడంతో 16 జీవాలు మృత్యువాత పడ్డాయి. దాదాపు రూ.80 వేల నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు.

# నాన్న ఫ్రెండ్ సలహాతోనే..

టర్నింగ్ పాయింట్

**అగ్రికల్చర్ వైపు అడుగులు వేశా**

- డాక్టర్ కావాలనుకున్నా సీటు రాలేదు
- 1983లో రిసెర్చ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం
- 2019లో ఉద్యోగ విరమణ
- వాతావరణ మార్పులపై రైతులకు సలహాలు, సూచనలు
- 130 రిసెర్చ్ పేపర్‌లు పబ్లిష్
- 'సాక్షి'తో ఉద్యాన యూనివర్సిటీ వీసీ డాక్టర్ దండ రాజిరెడ్డి



పంటలను పరిశీలిస్తున్న రాజిరెడ్డి

**సాక్షి, సిద్దిపేట :** మా నాన్న స్నేహితుడు ఒకరు రైల్‌లో కలిసినప్పుడు మీ అబ్బాయిని అగ్రికల్చర్ చేయించు అని సలహా ఇచ్చారు. ఆయన సలహా, సూచనలతోనే అగ్రికల్చర్ బీఎస్సీ వైపు అడుగులు వేశాను.. అప్పటి నుంచి ఒక్కో మెట్టు ఎక్కుతూ.. ఇప్పుడు విశ్వవిద్యాలయం ఉపకులపతి స్థాయికి ఎదిగానంటున్నారు డాక్టర్ దండ రాజిరెడ్డి. ఇప్పటి వరకు 130 వరకు రిసెర్చ్ పేపర్‌లు పబ్లిష్ అయ్యాయి. ఉద్యాన రైతుల అభివృద్ధికి కృషి చేయడమే లక్ష్యమని చెప్పుకొచ్చారు. ఇటీవల సిద్దిపేట జిల్లా ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఆయన్ను ప్రభుత్వం నియమించింది. ఈ క్రమంలో వీసీగా ఎదిగిన తీరును 'సాక్షి'తో పంచుకున్నారు.

**డాక్టర్ చదవాలనుకున్నా**

మా గ్రామంలో 8వ తరగతి వరకే ప్రభుత్వ పాఠశాల ఉంది. దీంతో మెరుగైన విద్య కోసం హన్మకొండలో చదువుకునేందుకు మా నాన్న పంపించారు. అక్కడే 9వ తరగతి మల్టీపర్పస్ ప్రభుత్వ పాఠశాలలో, 10వ తరగతి మర్కజీ ప్రభుత్వ పాఠశాలలో, ఇంటర్ హన్మకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ చదివాను. డాక్టర్ చదువాలనుకున్నా మెడిసిన్‌లో సీటు రాలేదు. దీంతో మహారాష్ట్రలో అగ్రికల్చర్ బీఎస్సీ, ఎమ్మెస్సీ (వ్యవసాయశాస్త్రం) పూర్తి చేశాను. చదువు పూర్తి కాగానే ఏపీ అగ్రికల్చర్ యూనివర్సిటీలో రిసెర్చ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ 1983 సంవత్సరంలో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం చేస్తూనే వ్యవసాయ వాతావరణ శాస్త్రంలో పీహెచ్‌డీని గుజరాత్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో చేశాను. 1993 వరకు నాన్నతో కలిసి వ్యవసాయం చేశాను.

**ట్రైన్‌లో చెప్పిన ఆ మాటలే..**

నాకు డాక్టర్ కావాలని ఉండేది.. ఎంబీబీఎస్ సీటు రాలేదు.. ఒక రోజు నాన్న ట్రైన్‌లో ప్రయాణం చేస్తుండగా... నాన్నకు తన ఫ్రెండ్ కలిశారు. పిల్లలు ఏమి చదువుతున్నారు.. కుటుంబ వివరాలు అడిగి తెలుసుకున్న క్రమంలో నా గురించి నాన్న ఆయన ఫ్రెండ్‌కు చెప్పారు. అగ్రికల్చర్ బీఎస్సీ చేపించండి అని సలహా ఇచ్చారు. దీంతో నాన్న అగ్రికల్చర్ బీఎస్సీ ఎక్కడ ఉందో తెలుసుకున్నాడు. మహారాష్ట్రలో ఉందని తెలిసి అన్ని వివరాలు కనుక్కొని నన్ను అగ్రికల్చర్ బీఎస్సీలో జాయిన్ చేపించారు. ఆ రోజు మా నాన్నకు ఆ అంకుల్ కలవకపోతే సాధారణంగా బీఎస్సీ మాత్రమే చేసేవాడిని.. ఆ అంకుల్ చెప్పడంతోనే అగ్రికల్చర్ విద్య వైపు వచ్చాను. ఇప్పుడు రైతుల అభివృద్ధికి కృషి చేస్తున్నా.

**రైతు మేళాలు నిర్వహిస్తా**

ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ లాభాలు పొందే అవకాశం ఉంటుంది. పండ్లు, కాయగూరలు, పువ్వులు, సుగంధ ద్రవ్యాలు, పోస్ట్ హార్వెస్టింగ్ పై ఎక్కువగా ఫోకస్ పెడతాం. ఉద్యాన పంటలు సాగు చేసే రైతుకి, వినియోగదారుడికి ధరలో వ్యత్యాసం ఉంటుంది, ఆ ధరల్లో ఎందుకు వ్యత్యాసం ఉందని తెలుసుకొని ఏ మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉంటుందో అక్కడ విక్రయించుకుంటే లాభం వస్తుంది. అలాగే ఉద్యాన పంట ఉత్పత్తులకు జియో ట్యాగ్ వచ్చే విధంగా కృషి చేస్తాను. రైతు మేళాలు నిర్వహిస్తా, రైతులకు సాగులో నూతన టెక్నాలజీ అందించే విధంగా ముందుకు సాగుతాం.



**టీవీల ద్వారా రైతులకు సూచనలు, సలహాలు**



1998 నుంచి 2013 వరకు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వివిధ హోదాల్లో పని చేస్తూ వాతావరణంలో చోటు చేసుకునే మార్పుల పై రైతులకు అవగాహన సదస్సుల ద్వారా పలు సూచనలు, సలహాలు ఇచ్చాను. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో టీవీల ద్వారా రైతులు అడిగి ప్రశ్నలకు సూచనలు చేశాను. 2014లో జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్, 2017లో డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ విధులు నిర్వర్తిస్తూ అక్టోబర్, 2019 ఉద్యోగ విరమణ పొందాను. రెండేళ్ల పాటు వరల్డ్ బ్యాంక్ తరఫున ఆఫ్ఘనిస్తాన్‌కు వాతావరణ మార్పుల సలహాలు ఇచ్చాను. నా అనుభవాన్ని చూసి ప్రభుత్వం ఉప కులపతిగా నియమించింది.

**కుటుంబ నేపథ్యం**

మాది పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరామ్‌పూర్ మండలం కునారం గ్రామం. దండ రాంరెడ్డి–సుభద్రలకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉంది. నాన్న ప్రభుత్వ టీచర్‌గా పని చేసేవారు.. అయినప్పటికీ వ్యవసాయం చేసేవారు. నాకు 1982లో సూర్యకుమారితో వివాహమైంది. ఇద్దరు కుమారులున్నారు.

# విరాళం పేరుతో నయా మోసం

- గుర్తు తెలియని వ్యక్తులు రైతుకు టోకరా
- రూ.5 వేలు తీసుకొని ఉడాయింపు



రసీదు చూపుతున్న దుర్గారెడ్డి

**మిరుదొడ్డి(దుబ్బాక):** గుర్తు తెలియని వ్యక్తులు విరాళం పేరుతో నయా మోసానికి తెరలేపారు. అన్నదాన సత్ర నిర్మాణానికి విరాళం ఇవ్వాలంటూ ఓ రైతుకు మాయ మాటలు చెప్పి విరాళంతో ఉడాయించారు. ఈ ఘటన మండల పరిధిలోని ధర్మారంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన తీపిరెడ్డి దుర్గారెడ్డి ఇంట్లో ఉన్న సమయంలో ఆరుగురు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి శ్రీశైలం ఆలయంలో అన్నదానం, సత్రం నిర్మాణానికి గ్రామంలో ఒక్కొక్కరి వద్ద సుమారు రూ. 20 వేల వరకు విరాళాలు సేకరిస్తున్నామంటూ పరిచయం చేసుకున్నారు. తనకు అంత స్థోమత లేదని రూ.500 విరాళం ఇస్తానని చెప్పాడు. గ్రామంలో చాలా మంది ఇచ్చారు మీరు కూడా ఇవ్వాలని ఒత్తిడి తెచ్చారు. దీంతో చేసేది లేక బాధితుడు వరి కోత కోసం తెచ్చి పెట్టుకున్న డబ్బుల్లో రూ.5 వేలు ఇచ్చాడు. అనంతరం గ్రామంలో ఎవరైనా విరాళం ఇచ్చారా అని ఆరా తీయగా.. విరాళాల పేరుతో గ్రామంలోకి ఎవరూ రాలేదని తోటి గ్రామస్తులు తేల్చి చెప్పడంతో బాధితుడు ఒక్కసారిగా కంగుతిన్నాడు. దుర్గారెడ్డికి అనుమానం రావడంతో వారు ఇచ్చిన రసీదులోని నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు గ్రామస్తులతో కలిసి మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బోయిని పరుశరాములు తెలిపారు.

# ప్రాణాలు తీసిన రాంగ్ రూట్

**కారు, మోటార్‌సైకిల్ ఢీకొని యువకుడు మృతి**

**నారాయణఖేడ్:** రాంగ్ రూట్ ప్రయాణం ఓ యువకుడి ప్రాణాలు బలి తీసుకుంది. కారు, మోటార్‌సైకిల్ ఎదురెదురుగా ఢీకొనడంతో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల కేంద్రం సమీపంలో కేఎస్ఆర్ కార్యాలయం వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నిజామాబాద్ జిల్లా బోధన్ రక్కసిపేటకు చెందిన గోపికుమార్(30) మోటార్ సైకిల్‌పై హైదరాబాద్ వెళ్తున్నాడు. ఎక్సైజ్ ఎస్‌ఐగా పని చేస్తున్న విజయ్ కారులో జోగిపేట నుంచి కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొనగా గోపికుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. రాంగ్‌రూట్‌లో వచ్చి తన కారును ఢీకొట్టి మృతి చెందాడని విజయ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఖేడ్ ఎస్‌ఐ విద్యాచరణ్ రెడ్డి తెలిపారు.

**రెండు బైక్‌లు ఢీ : ఒకరు మృతి**

**చిన్నశంకరంపేట(మెదక్):** రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన చిన్నశంకరంపేట మండలం సూరారం గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని సూరారం గ్రామానికి చెందిన గజం కిషన్(60) బైక్‌పై చిన్నశంకరంపేట వైపు వెళ్తున్నాడు. ఇదే సమయంలో చిన్నశంకరంపేట వైపు నుంచి సూరారం వైపు చేగుంట మండలం పొలంపల్లి గ్రామానికి చెందిన రమేశ్ బైక్ పై వస్తున్నాడు. మార్గమధ్యలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను గ్రామస్తులు 108 అంబులెన్స్ ద్వారా మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కిషన్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు.

**లారీకి విద్యుత్ వైర్లు తగిలి ఆపరేటర్..**

**మనోహరాబాద్(తూప్రాన్):** లారీకి విద్యుత్ వైర్లు తగిలి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శుక్రవారం ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రం, గర్వ జిల్లాకు చెందిన జితేంద్ర ప్రజాపతి (23) నాలుగు నెలల కిందట హిటాచీ ఆపరేటర్‌గా పని చేయడానికి మండలంలోని కూచారం గ్రామానికి వచ్చాడు. గురువారం రాత్రి లారీపై హిటాచీని ఎక్కించి పోతారం మీదుగా శివ్వంపేట మండలానికి వెళ్తున్నారు. పోతారం గ్రామంలో కిందికి వేలాడుతున్న విద్యుత్‌వైర్లు హిటాచీకి తగిలాయి. దీంతో లారీని ఆపారు. విద్యు త్ వైర్లను తొలగించడానికి కిందికి దిగిన ఆపరేటర్ జితేంద్ర కింద బురదలో నిలబడి లారీని పట్టుకున్నాడు. దీంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘనపై బంధువు ఉజ్జార్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ ప్రమాదానికి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమని తాజా మాజీ సర్పంచ్ మాధవరెడ్డి ఆరోపించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాస్ గౌడ్

**అనుమానాస్పద స్థితిలో కార్పెంటర్..**

**శంకర్‌పల్లి:** అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాస్‌గౌడ్, గ్రామస్తుల కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మునిదేవునిపల్లి గ్రామానికి చెందిన శేఖర్ (40) కార్పెంటర్‌గా పని చేస్తున్నాడు. తండ్రి బాలరాజు 12 ఏళ్ల కిందట ఇల్లు వదిలి వెళ్లగా.. తల్లి లక్ష్మి రెండేళ్ల కిందట మరణించింది. అన్న ఆంజనేయులు మెదక్ జిల్లా నర్సాపూర్‌లో కార్పెంటర్ దుకాణం నిర్వహిస్తుండగా శేఖర్ అక్కడే పని చేసేవాడు. నాలుగు రోజుల కిందట తల్లి సంవత్సరీకం ఉందని పటాన్‌చెరులో ఉండే అక్క కల్పన ఇంటికొచ్చాడు. అక్కడ నుంచి శంకర్‌పల్లికి వచ్చి పట్టణ శివారులో శవమై తేలాడు. శుక్రవారం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మద్యం తాగి, బహిరంగ మలవిసర్జనకు వచ్చిన క్రమంలో ఫిట్స్ వచ్చి మృతి చెందినట్లుగా భావిస్తున్నారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

**ఆటోను ఢీకొట్టిన ఎక్సెల్**

**అల్లాదుర్గం(మెదక్):** ఆటోను టీవీఎస్ ఎక్సెల్ ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని భైరవ దిబ్బ గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్ రెడ్డి కథనం మేరకు.. పాపన్నపేట మండలం ముద్దాపూర్ గ్రామానికి చెందిన కూలీలు ఆటోలో రేగోడు మండలం ఇటిక్యాల గ్రామానికి వరి కోతలకు వచ్చారు. తిరిగి ఇటిక్యాల గ్రామం నుంచి ముద్దాపురం వెళ్తుండగా బహిరాన్ దిబ్బ శివారులోకి రాగానే ఎదురుగా ఎక్సెల్ వాహనం వచ్చి ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలోని సంగయ్య కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. ఎక్సెల్ నడుపుతున్న పాండుకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ భాగయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

# భర్త అదృశ్యం.. భార్య ఆత్మహత్య

**పెళ్లైన నాలుగు నెలలకే విషాదం**

**గజ్వేల్‌రూరల్:** కుటుంబ కలహాలతో భర్త అదృశ్యమవగా.. ఉరేసుకొని భార్య ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం గజ్వేల్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వర్గల్ మండలం మైలారం గ్రామానికి చెందిన భాను ఇదే మండలంలోని మాదారానికి చెందిన రేణుక(22)ను నాలుగు నెలల కిందట ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నాడు. భాను పెయింటర్‌గా, రేణుక ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తూ గజ్వేల్ పట్టణంలోని పిడిచెడ్ రోడ్డు మార్గంలో ఓ ఇంట్లో అద్దెకుంటున్నారు. వీరి ఇద్దరి మధ్య కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ గొడవ గురించి రేణుక 11న తల్లిగారికి, 14న ఉదయం మైలారంలోని అత్తగారికి చెప్పింది. అదే రాత్రి గజ్వేల్‌లో తాము అద్దెకున్న ఇంటికి వెళ్లింది. ఇంతలోనే భాను తాను చనిపోతున్నానంటూ సెల్‌ఫోన్‌లో వీడియో తీసి కుటుంబ సభ్యులకు జరిగిన విషయాన్ని చెప్పి అదృశ్యమయ్యాడు. భాను కుటుంబ సభ్యులు 14న అర్ధరాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో రేణుక తల్లిదండ్రులు శుక్రవారం ఉదయం గజ్వేల్‌కి వచ్చి చూడగా అప్పటికే ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించింది. భానుతోపాటు అతడి తల్లిదండ్రులు తమ కూతురి చావుకు కారణమంటూ మృతురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

**వ్యాపారంలో నష్టం వచ్చిందని ఉరేసుకొని**

**రామాయంపేట(మెదక్):** చేపల వ్యాపారంలో నష్టం రావడంతో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన ముద్రబోయిన మల్లయ్య (48) చెరువులో చేపలు పట్టుకోవడానికి కాంట్రాక్టు తీసుకున్నాడు. ఇందులో నష్టం రావడంతో అప్పులు పెరిగిపోయాయి. ఈ బాధతో గురువారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం గ్రామ శివారులో చెట్టుకు ఉరివేసుకొని కనిపించడంతో గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. మృతుడి భార్య శ్యామల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### జీజేసీపీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రవీందర్‌రెడ్డి



**సిద్దిపేట ఎడ్యుకేషన్:** ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్(జీజేసీపీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సిద్దిపేట జిల్లా కోహెడ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా ఇంటర్ విద్యాధికారి(డీఐఈఓ) రవీందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. హైద్రాబాద్‌లోని యూనియన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల్లో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడం తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. సంఘం సభ్యుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తూనే రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యను మరింత బలోపేతం చేసేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. రాష్ట్ర కార్యదర్శిగా గజ్వేల్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్, సంయుక్త కార్యదర్శిగా జగదేవ్‌పూర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజన్నలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కనకచంద్రం, ప్రచారకార్యదర్శి నాగేందర్, అధికార ప్రతినిధి నంట శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు గిరి రవి, ప్రధాన కార్యదర్శి ధరిపల్లి నగేశ్, ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కిషన్, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అమరేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్స్ సత్యనారాయణరెడ్డి, కూచంగారి శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

# భూమి కబ్జాకు గురైంది.. న్యాయం చేయండి

**మంత్రి పొన్నంకు బాధితుడి వినతి**

**ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):** మా తాతల కాలం నుంచి వస్తున్న భూమిని కొంతమంది నకిలీ డాక్యుమెంట్‌లు సృష్టించి కాజేశారని, నాకు న్యాయం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సిద్దిపేట పట్టణంలో శుక్రవారం బాధితుడు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ.. సిద్దిపేట పట్టణానికి చెందిన ఎక్కలదేవి లింగంకు ఓ సర్వే నంబర్‌లో 1.20 ఎకరాల సొంత భూమిని పట్టణానికి చెందిన నలుగురు వ్యక్తులు కబ్జా చేశారని ఆరోపించారు. ఫోర్జరీ డాక్యుమెంట్‌లు తయారు చేసి, నా భూమిని కబ్జా చేశారని వాపోయాడు. ఇప్పటి వరకు కోర్టులను, అధికారులను తప్పుదోవ పట్టించే విధంగా కొనుగోలు పత్రాలు సృష్టించారని తెలిపారు. క్షేత్ర స్థాయిలో పూర్తి విచారణ జరిపించి, నా భూమిని నాకు ఇప్పించాలని లింగం మంత్రికి విన్నవించారు. దీనిపై స్పందించిన మంత్రి పొన్నం పూర్తి స్థాయిలో విచారణ చేయించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

### హక్కుల కోసం కొట్లాడే వారిని ఎన్నుకోవాలి

**టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్**



మాట్లాడుతున్న అశోక్ కుమార్

**మెదక్‌జోన్:** ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు పెట్టుబడుదారులొస్తున్నారని, టీచర్లంతా అప్రమత్తంగా ఉండి హక్కుల కోసం కొట్లాడే అభ్యర్థులను ఎన్నుకోవాలని తెలంగాణ ప్రోగ్రెసీవ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్ కుమార్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కరీంనగర్ నియోజకవర్గ టీచర్స్ అభ్యర్థిగా తనను రాష్ట్ర కమిటీ ప్రకటించిందన్నారు. శుక్రవారం పట్టణంలోని టీఎన్జీవో భవన్‌లో జరిగిన టీపీటీఎఫ్ జిల్లా సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విధానాల అమలులో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు ఒక్కటేనన్నారు. టీపీటీఎఫ్ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. తెలంగాణలో 4 శాతం మంది విద్యార్థులకు మాత్రమే నాణ్యమైన విద్య అందుతుందని, మిగితా విద్యార్థుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొండల్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, భాస్కర్ రెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంగయ్య వెంకట్రామిరెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు కాముని రమేశ్ పాల్గొన్నారు.



# నకిలీ పత్రాలతో భూమి ఆక్రమణ

**ఉపాధి కోసం వెళ్తే కబ్జా చేశారని బాధితుడి ఆవేదన**



మాట్లాడుతున్న మహేందర్ గౌడ్

**దుబ్బాకటౌన్:** వంశపారంపర్యంగా వస్తున్న భూమిని ఆక్రమించిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేటకు చెందిన బాధితుడు బత్తిని మహేందర్ గౌడ్ వేడుకున్నాడు. శుక్రవారం దుబ్బాకలో ఆయన విలేకరులతో మాట్లాడారు. లచ్చపేటలో సర్వే నంబర్ 26లో కొంత భూమిని సిరిసిల్ల పట్టణానికి చెందిన ఓ వ్యక్తి కబ్జా చేశాడని ఆరోపిస్తూ, ఇటీవల గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించిన వ్యక్తికి ఆ భూమితో ఎలాంటి సంబంధం లేదన్నారు. ఆ భూమి తమ కుటుంబానికి చెందిందన్నారు. 1953 నుంచి తమ తాత బత్తిని సీతయ్య పేరిట 11.23 ఎకరాలు రికార్డుల్లో ఉందన్నారు. ఉపాధి కోసం సీతయ్య కుమారులు ఇతర ప్రాంతాలకు వలస పోవడంతో, వారి భూమిని పలువురు కబ్జా చేశారని వాపోయాడు. గ్రామానికి చెందిన కొంత మంది అక్రమార్కులు, స్థానిక ప్రజా ప్రతినిధుల అండతో తప్పుడు పత్రాలు సృష్టించి, భూములను కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవలె 1,805 గజాల స్థలాన్ని రాజన్న సిరిసిల్ల పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఫోర్జరీ పత్రాలతో రికార్డులు సృష్టించి, రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని, ఈ అంశం కోర్టు పరిధిలో ఉందన్నారు. తమ పూర్వీకులకు చెందిన భూమికి సంబంధించి కోర్టు కేసు ఉన్నందున ప్రజలు భూమిని కొనుగోలు చేసి ఇబ్బందులు పడొద్దని సూచించారు. భూమి వ్యవహారం కోర్టు పరిధి ఉండగా అమ్మడం, కొనడం చట్టవిరుద్ధమన్నారు.

# తగ్గిన దిగుబడి.. పెరిగిన అప్పులు

**భారీగా పడిపోయిన పత్తి ఉత్పత్తి**

- క్వింటాల్‌కు రూ.6,700
- ధర పెరుగుతుందని ఇంట్లోనే నిల్వ
- ఆందోళనలో రైతులు



పెట్టుబడి కూడా రాని పరిస్థితి..

**మునిపల్లి(అందోల్):** వ్యాయ ప్రయాసాల కోర్చి ఆరుగాలం కష్టపడి పండించిన పత్తి పంట రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. పంటచేతి కొచ్చిన సమయంలో తూఫాన్ రూపంలో వర్షాలు పడడంతో పంట దిగుబడి సగానికి పైగా తగ్గిపోయింది. అలాగే పత్తి తెంపడానికి కూలీల కొరత ఏర్పడింది. కిలోకి రూ.11 నుంచి రూ.12 వరకు ఇచ్చి కూలీలను పిలిపిస్తున్నారు. కూలీలు ఇంటి నుంచి గ్రామాలకు రాను పోను ఖర్చు, ఉండడానికి వారు వచ్చిన నుంచి పోయే దాక ఇతరాత్ర ఖర్చులన్నీ రైతులే భరిస్తున్నారు. కూలీలకు టార్పాలిన్లు, తినడానికి కలిపి మరో రూ.3 ఖర్చు అదనంగా అయ్యి మొత్తంగా కిలో రూ.15 లెక్కన రైతులపై భారం పడుతుంది. ఎకరాకు 3 నుంచి 6 క్వింటాళ్ల పత్తి రావడంతో పంట దిగుబడి కోసం పెట్టిన పెట్టుబడి రావడమే కష్టంగా మారింది. పత్తి దిగుబడి సాధించాలనే లక్ష్యంతో రైతులు అన్ని రకాల ఎరువులు, పిచికారీ మందులు, సమయానికి కలుపుతీత పనులను నిర్వహించారు. పత్తి తెంపే సమయంలో క్వింటాల్‌కు బయట మార్కెట్‌లో దళారులు రూ.6,500 నుంచి రూ.6,900 వరకు కొనుగోలు చేస్తున్నారు. పాస్‌పుస్తకాలు ఉన్న రైతుల నుంచి సీసీఐ కేంద్రాల్లో పత్తి క్వింటాల్‌కు రూ.7 వేల నుంచి రూ.7,300 వరకు కొనుగోలు చేస్తున్నట్లు పలువురు రైతులు పేర్కొంటున్నారు. కానీ ఇంకా ధర పెరుగుతుందని కొంత మంది రైతులు పత్తిని ఇంట్లోనే నిల్వ ఉంచుతున్నారు.

**ఎకరానికి రూ.20 వేల పైనే ఖర్చు**



వర్షాలతో పంట దిగుబడి 70 శాతం తగ్గి పోయింది. పంట దిగుబడి కోసం పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు. ఒక వైపు దిగుబడి రాక.. మరోవైపు ధర లేకపోవడంతో నిరాశలో కొట్టు మిట్టాడుతున్నాం. విత్తనాలు, ఎరువులు, కలుపుతీత, పురుగు నివారణ మందు పిచికారీ, పత్తి పంట తెంపే కూలీల ఖర్చులతో ఎకరాకు రూ.20 వేలపైనే ఖర్చు అయ్యింది. –బోయిని శ్రీనివాస్, తాటిపల్లి